

నగరంలో భిక్షాటన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రంలో రాజకీయ శూన్యత

- ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే జనంబాట
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం కరీంనగర్‌లోని వీ పార్క్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల సమస్యలను దగ్గర నుంచి తెలుసుకోవడం కోసమే జనంబాట కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తాను వాళ్ల, వీళ్ల బాణాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

కాదని తెలంగాణ ప్రజల బాణాన్ని అని అన్నారు. జనం బాట పూర్తయిన తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రజల తరఫున పోరాడాల్సిన పార్టీలు ఆ పనిచేయటం లేదన్నారు. తమ ప్రాధాన్యం ప్రజల సమస్యలు తీర్చటమే అన్నారు. ఇప్పుడు ప్రధాన పార్టీలన్నీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉన్నాయన్నారు. మొంథా తుపానుతో రైతులు నష్టపోయినా పట్టించుకోవడం లేదన్నారు. జాగృతి రాజకీయ వేదికేనని చాలా సందర్భాల్లో రాజకీయాలు మాట్లాడామన్నారు. మోదీ కార్మికుల హక్కు లను కాలరాస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేయాల్సినంత పోరాటం చేయలేదని ఆరోపించారు. రైతు చట్టాల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ లేబర్ చట్టాల గురించి మాట్లాడలేదన్నారు. మోదీ కారణంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో మహిళలకు మేలు జరుగుతుందని, తెలంగాణలో 69 మంది మహిళ ఎమ్మెల్యేలు అవుతారని అన్నారు. ప్రధానమంత్రి మోదీ కార్మికుల విషయంలో నల్ల చట్టాలు తెచ్చినా సరే మనం స్పం దించలేదని ఆరోపించారు. గ్రానైట్ ఆదాయాన్ని జిల్లా అభివృద్ధికి విని యోగించాల్సిన అవసరముందన్నారు. తుఫానుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులు పూర్తికావడం లేదన్నారు. సమా వేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి జాడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



ఓటేస్తున్న బ్యాంకు సభ్యుడు

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

- 44.23 శాతం పోలింగ్
- పోలైన ఓట్లు కరీంనగర్‌లో 3,342, జగిత్యాలలో 772

కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సాధారణ ఎన్నికల తరహాలో ఉదయం 7 గంటల నుంచే బ్యాంకు సభ్యులు (ఓటర్లు) తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. 12 డైరెక్టర్లలో ఎస్సీ, ఎస్టీకి ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌కు తొమ్మిది స్థానాలను రిజర్వు చేశారు. 12 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గ ఎన్నికలకు 54 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఒక్కో ఓటరు 12 ఓట్లు వినియోగించుకోవచ్చు. తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాసరెడ్డి, మరో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి వెలి చాల రాజేందర్‌రావు మద్దతు మరో ప్యానల్ మొత్తం మూడు ప్యానల్స్‌లో 36 మంది, 18 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. నాలుగు రౌండ్లలో లెక్కింపు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితం తేలనున్నది. గెలుపొందిన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.

- కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

హుజూరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం హుజూరాబాద్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బేటీ బచావో.. బేటీ పడావో లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రంలో మహిళల శాతం చాలా తక్కువగా ఉందని, పురుషులతో పోలిస్తే స్త్రీల జననం తక్కువగా నమోదైందన్నారు. కొంత మంది అవగాహన లేక లింగ నిర్ధారణ పరీక్షల్లో ఆడబిడ్డ అని తెలియగానే అబా ర్షన్లు చేయించుకుంటున్నారని, ఇది తగదన్నారు.

స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్ల అని చెబితే ఆ సెంటర్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, డాక్టర్ సంజీవరయ్య, మున్సి పల్ కమిషనర్ సమ్మయ్య, డాక్టర్ ఉమాశ్రీ, మధుకర్, తులసిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను విస్మరిస్తున్న ప్రభుత్వం

భగత్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను విస్మరిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. పెండింగ్‌లోని ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ శనివారం నగరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తామని హామీ ఇస్తున్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఎందుకు ఇవ్వ డం లేదని ప్రశ్నించారు. ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ విద్యార్థులు పేద మధ్య తరగతి కుటుంబాలపై లేదన్నారు. విద్యార్థులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంపెల్లి అర వింద్, ఆసంపల్లి వినయ్‌సాగర్, దుర్గం భోగేష్, గట్టు అకాష్, రాకేష్, సందేశ్, నాయకులు సన్నీత్, సంతోష్, రామ్ చరణ్, దుర్గా, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు

7

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో విజేతలుగా నిలవాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

7

పెన్షనర్స్‌కు బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్‌కు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండర్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు చందుపట్ల జనార్ధన్, గడ్డం అశోక్ పేర్కొన్నారు. శనివారం హుజూరాబాద్‌లో వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్‌కు రావాల్సిన కమ్యూటే షన్, గ్రాడ్యుటీ, జీపీఎఫ్ లాంటి పెన్షనరీ బెనిఫిట్స్ ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్



శాతవాహన రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు నోటీసు అందిస్తున్న కళాశాలల యజమానులు

గణేష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3వ తేదీ నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్‌లో పాల్గొననున్నట్లు శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు ప్రైవేటు కళాశాలల యజమానులు మెమొ రాండం అందించారు. ఈ సందర్భంగా కళా శాలల యజమానులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తూ కళాశాలల పట్ల భిన్న వైఖరిని అవలంభిస్తుందన్నారు. ఫీజు రీయిం బర్స్‌మెంట్ సాధనలో భాగంగా సోమవారం 3వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థలు నిర వధిక బంద్‌కు ఇచ్చిన పిలుపులో భా గంగా యూనివర్సిటీ పరిధిలో అన్ని డిగ్రీ, పీజీకళాశాలలు బంద్ పాటించనున్నట్లు తెలిపారు.

- బీఈడీ కళాశాలల అధ్యాపకుల నిరవధిక సమ్మె

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలకు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ఎస్‌యు టీఏఏ నాయకులు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు మెమొరాండం అందించారు. నవంబరు 3వ తేదీ నుంచి యూని వర్సిటీ పరిధిలోని 23 బీఈడీ కళా శాలల అధ్యాపకులు సమ్మెకు దిగు తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ టీచర్ ఎడ్యుకేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీచర వేణుగోపాలరావు, ప్రధాన కార్య దర్శి సుదర్శన్‌రెడ్డి, తిరుపతి, దేవేందర్, రవి నందన్, రాజుకుమార్, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను కించపరిచిన సీఎం

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్

గణేష్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశాన్ని, సైనికుల త్యాగాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కించపరిచారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం వాఖ్యలకు నిరసనగా సీఎం దిష్టి బొమ్మను బీజేపీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఆపరేషన్ సింధూర్, ఆర్మీపై సీఎం రేవంత్‌రెడ్డికి తెలియకపోవడం దౌర్భాగ్యమన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా సైనికులపై చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఆర్మీని అవమానించే రీతిలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గుగ్గిళ్లపు రమేష్, వాసాల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, కార్పోరేటర్ కొలగాని శ్రీనివాస్, అనూప్, బండ రమణరెడ్డి, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, మైనార్టీ మోర్చా నాయకులు మహ మ్మద్ ముజ్జీబ్, పర్వేజ్, బల్బీర్ యువ మోర్చా నాయకులు మునిగంటి కుమార్, గుండారపు సంపత్, ఉప్పరపెల్లి శ్రీనివాస్, సింగ్, ఎర్రోళ్ల ప్రదీప్‌కుమార్, హరిప్రసాద్, పదం శివరాజ్, బండారు గాయత్రి, కుంట తిరుపతి, ఆనంద్, ప్రశాంత్, ముత్తునూనరి హరీష్, చాడ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రేపు భారత వాయుసేనపై అవగాహన సదస్సు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో చేరేందుకు ఈ నెల 3న నగరంలోని కళా భారతి ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించ నున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాండింగ్ ఆఫీసర్ షేక్ యాకుబ్ అలీ వాయుసేనలో చేరడం ఎలా, వాయుసేనలో అవకాశాలు ఎలా ఉంటాయి, పరీక్ష విధా నం, సిలబస్, పూర్తి సెలక్షన్ వివరాలను అభ్యర్థులకు వివరి స్తారని తెలిపారు. భారత వాయుసేనలో చేరేందుకు ఇదొక సు వర్ణ అవకాశమని, ప్రతి అభ్యర్థి విని యోగించుకోవాలని కోరారు. ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16-21 సంవత్సరాల్లోపు యువతీ, యువకు లు సదస్సులో పాల్గొనాలని కోరారు. ఇతర వివ రాలకు ఫోన్ 9949725997, 8333044460 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఓటరు రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

- రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కరీంనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలతో రివిజన్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాలో నియో జకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మాపింగ్ చేసి నాలుగు కేటగి రీలుగా విభజించడం జరిగిందని, కేట గిరీ-ఏలో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ-బిలో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేట గిరి-సిలో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ-డిలో 2002-2007 మధ్యలో జన్మిం చిన వారీగా విభజించడం జరిగిందని అన్నారు. మొదటి కేటగిరీ-ఏ జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల ఓటర్లును నిర్ధారించడం జరిగిందని అన్నారు. మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధార ణను త్వరగా పూర్తిచేయాలని అన్నారు. కేటగిరి-సి, కేటగిరి-డి లోని ఓటర్లను కేటగిరి-ఎకు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగు పరచాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశినీ తానాజీ వాఖడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ పమేలాసత్పతి

- క్లెయిమ్ చేయని ఆస్తులపై అవగాహన కల్పించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా క్లెయిమ్ చేయని ఆస్తులు (బ్యాంకు డిపాజిట్లు, బీమా, పీఎఫ్, మ్యూచవల్ ఫండ్స్, షేర్లు)ను క్లెయిమ్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకు, బీమా, ఆర్థిక సంస్థల ప్రతినిధులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకు, బీమా, నియంత్రణ సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రెండు లక్షల కోట్ల ఆస్తులు క్లెయిమ్ చేయనివి ఉన్నాయని, వీటిని అర్హులైన పౌరులకు అం దించేందుకు కేంద్ర ప్రభుత్వం యుడి జిఎఎం పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని చెప్పారు. అక్టోబరు 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మీ డబ్బు .. మీ హక్కు నినాదంతో దీనిని గుజరాత్‌లో ప్రారంభించారని అన్నారు. సంబంధిత బ్యాంకులు, సంస్థల వద్దకు వెళ్లి మీ వద్ద ఉన్న సరైన పత్రాలు సమర్పించి నగదు పొందాలని ఖాతాదారులకు కలెక్టర్ సూచించారు. డిసెంబర్ 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, గ్రామాలవారీగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ క్లేమ్ చేయని డిపాజిట్లు, బీమా, పీఎఫ్ వంటి వాటిపై ప్రజలకు విస్తృత అవ గాహన కల్పించాలని సూచించారు. డీజీఎం సోలంకి,ఎస్ఎల్‌బీసీ చైర్మన్ శ్రీహరి, యూబీఐ డీజీఎం అపర్ణరెడ్డి, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, ఆర్‌బీఐ ఏజీఎం, నాబార్డ్ అధికారులు ఉన్నారు.

జీఎం కాలనీ ఆలయంలో చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయకమిటీ నిర్వాహకులు శనివారం ఉదయం విషయాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో పరిశీలించారు. కాగా ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీకి సంబంధించిన ఆధారాలు లభించలేదు. గతంలో ఇదే ఆలయంలో హుండీ చోరీ జరిగింది. రెండోసారి చోరీ జరుగడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

ఎండపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రేణుకఎల్లమ్మ తల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగుల గొట్టి దొంగతనం చేశారు. హుండీలోని రూ.50వేల విలువైన పుస్తె, మట్టెలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్‌ఐ శ్రీధర్, ఎండోమెంట్ అధికారులు శరత్, శ్రీనివాస్ పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి పట్టివేత

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్ వాటర్ ట్యాంకుసమీపంలో శనివారం తప్పట్ల సందీప్ అలియాస్ బబ్లూ అనేవ్యక్తి నుంచి 135 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వాటార్ ట్యాంకుగేట్ ఎదురుగా సందీప్ అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించాడు. అతడిని విచారణ చేయగా గంజాయి దొరికినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- గత ప్రభుత్వ హయాంలో కొంత పరిహారం, పట్టాలు పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితుల ఆశలు

పరిహారం కోసం నిరీక్షణ



వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): : మధ్యమానేరు నిర్వాసితులు పరిహారం కోసం పదిహేనేళ్లుగా నిరీక్షిస్తున్నారు. మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. బోయినపల్లి, వేములవాడ మండలాల్లోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ఆయా గ్రామాల్లో 10683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతో పాటుగా వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10683 కుటుంబాలకు 10044 కుటుంబాలకు పరిహారం చెల్లిం చారు. మిగతా 639 కుటుంబాల్లో 219 కుటుంబాలకు చెందిన వారి సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ.20.22 కోట్లతో నివేదికను ప్రభు త్వానికి అందించారు. మిగిలిన 420 కుటుంబాల్లో కొం దరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ.30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసి తులకు పరిహారం చెల్లిస్తూ 10 సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించ డంలో నిర్లక్షంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడు ఆశతో ఉన్నామని నిర్వాసితులు చెబుతున్నారు.

ఇంకా అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతీయువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల పరిహారం అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3917మంది యువతను గుర్తించారు. అందులో యువతులు మొత్తం 2303 మందిని గుర్తించి, 1879 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతుల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89మంది యువతుల సంతకాలు మాత్రమే సేకరించారు, వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. 1614 మంది యువకులను గుర్తించగా, 1537 మందికి పరిహారం చెల్లించగా, 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు. వారికి ఇంకా చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..

- గుండెకార్ల దేవయ్య, ఆరెపల్లి



వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామం మాది. మా ఇల్లు ముంపులో పోయింది. అధికారులు వచ్చి దరఖాస్తులు తీసుకువెళ్లారు. నాలుగు సంవత్సరాల క్రితం నోటిఫికేషన్ పూర్తి అయింది. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిర్వాసితులపై దృష్టి సారించాలి..

- జింక శ్రీధర్, సంకెపల్లి



సంకెపల్లి గ్రామంలో గతంలో కొన్ని ఇళ్లను మాత్రమే ముంపునకు తీసుకున్నారు. తరువాత మిడ్‌మానేరు జలాశయం కెపాసిటీ పెంచిన తరువాత వాటర్ ఎఫ్‌టీఎల్‌ను దాటి రావడంతో పూర్తి ముంపు గ్రామంగా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారం, పట్టాలు వచ్చాయి. గ్రామంలో ఇంకా మిగిలిన 44 ఇళ్లకు పరిహారం రావాల్సి ఉంది. నోటిఫికేషన్ పూర్తి అయినప్పటికి పరిహారంలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించాలి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 14మందికి జైలుశిక్ష

● 57 మందికి జరిమానాలు



మందు బాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి జైలు శిక్షపడగా, 57మందికి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 71 మంది పట్టుబడ్డారు. వీరందరినీ వేములవాడ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 మందికి జైలుశిక్ష, 57 మందికి జరిమానాలు విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. ఇందులో 10 మందికి రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 49మందికి ఒక్కొక్కరికి రూ.1300 చొప్పున జరిమానా విధించారు. 8మందికి ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన యువకుడు

● చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్‌క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మాదిరి సతీష్‌కుమార్(39) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందుతాగగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కుమార్ కొంత కాలంగా మద్యంకు బానిసగామారాడు. ఈక్రమంలో అక్టోబరు 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య, ఇతర కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు సతీష్‌కుమార్ భార్య అక్షయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల వివాదంలో తనకు అన్యాయం చేస్తున్నారని మనస్తాపం చెందిన వృద్ధురాలు ఈసరియాదవ్వ పురుగుల మందు తాగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వృద్ధురాలు యాదవ్వ, క్యారం మంజుల మధ్య కొంతకాలంగా స్థలవివాదం కొనసాగుతోంది. మంజుల న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలు పొందిన ఆమె స్థలంలో ఇంటి ప్రహారీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని యాదవ్వ అడ్డుతగిలింది. ఇరువర్గాల నడుమ వాగ్వావాదం చోటుచేసుకుంది. తనకు అన్యాయం చేస్తున్నారని వృద్ధురాలు యాదవ్వ పురుగుల మందుతాగింది. పోలీసులు పురుగుల మందు డబ్బాను లాక్కొని అపస్మారక స్థితిలోకి ఉన్న యాదవ్వను మొదట ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి సిరిసిల్లకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎస్‌ఐ లక్ష్మణ్‌ను సంప్రదించగా ఇంటి స్థల విషయంలో మంజుల కోర్టు ఉత్తర్వుల ప్రకారం పనులను చేపట్టారని పేర్కొన్నారు. గొడవలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నామనిచెప్పారు. వృద్ధురాలు యాదవ్వ ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న తమ సిబ్బంది అడ్డుకుని పోలీసువాహనంలో ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

సిరిసిల్లలో ముగ్గురి అరెస్ట్

● తల్వార్‌లతో శాంతిభద్రతలకు విఘాతం



దాడులు చేసుకున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తల్వార్‌లతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని సుందరయ్య నగర్ సిక్‌వాడీకి చెందిన బురాని గోపాల్‌సింగ్, బురాని నర్సింహాసింగ్, రాజేష్‌సింగ్‌లు తల్వార్లు పట్టుకుని అక్టోబరు 8వ తేదీన రోడ్డుమీదికి వచ్చి భయం కరంగా అరుస్తూ వారిలోవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని తెలిపారు. చుట్టపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించారని, ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్కూటీ డిక్కీలోంచి నగదు చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని వైష్ణవి బేకరీ ఎదుట పార్కింగ్‌చేసిన స్కూటీనుంచి శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో నర్సింగ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంజలి మున్సిపల్‌ఆఫీస్ ఎస్‌బీఐఏటీఎంలో నగదు తీసుకుని స్కూటీడిక్కీలో పెట్టుకున్నారు. మార్కండేయ కాలనీలోని బేకరీవద్దకువెళ్లి కొనుగోలు చేస్తుండగా బైక్‌పైవచ్చిన ఇద్దరు స్కూటీడిక్కీ తాళం తీసి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. ఈఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికిచేరుకుని విచారణ జరుపుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంవద్దనుంచే దొంగలు అంజలిని ఫాలో అయినట్లు తెలుస్తుంది. అదనుకోసం చూసి సొమ్ముఎత్తుకెళ్లారు. సీసీపుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో ద్విచక్రవాహనాలను దొంగిలించే యత్నంలో దొంగ గ్రామ యువకులకు దొరికాడు. శనివారం రాత్రి తిప్పాపూర్‌లో రెండు ద్విచక్రవాహనాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు వెంటపడి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

●యువతికి తీవ్ర గాయాలు



బస్సు కింద ద్విచక్రవాహనం

మల్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని సాయిబాబా గుడి సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పెంచాల శృతి అనే యువతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం తాటిపల్లికి చెందిన పెంచాల శృతి ద్విచక్రవాహనంపై మల్యాలలో టిఫిన్స్ తీసుకొని తిరిగి తాటిపల్లికి వెళ్తుండగా జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఢీకొంది. దీంతో శృతి తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి తండ్రి పంబాల సురేశ్ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీసీఎం వ్యాన్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులో డీసీఎం వ్యాన్‌ను ఆర్టీసీబస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మొలంగూర్ శివారులో స్పీడ్‌బ్రేకర్ వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్‌వేశాడు. దీంతో వ్యాన్‌వెనక వస్తున్న కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీబస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సుపాక్షింగా ధ్వంసమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప కాలనీవద్ద జాతీయరహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెపు జశ్వంత్‌రెడ్డి తనస్నేహితుడు సాయిచరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్‌నుంచి సింగాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నంలోని అయ్యప్పకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో జశ్వంత్‌రెడ్డి కాలువిరగగా, తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతన్ని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై పడిన రేషన్ బియ్యం బస్తాలు



రోడ్డుపైన రేషన్ బియ్యం బస్తాలు

మార్కండేయకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై బుగ్గ రైల్వేబ్రిడ్జి సమీపంలో శని వారం రేషన్‌బియ్యం బస్తా లు తరలిస్తున్న లారీ నుంచి పది బస్తాల వరకు కింద పడ్డాయి. పెద్దపల్లి ఎంఎల్‌సీ గోడౌన్‌నుంచి ఎన్‌టీపీసీ ప్రాంత రేషన్ షాపులకు వస్తున్న లారీలో బస్తాలను సరిగా లోడ్ చేయకపోవడంతో కొన్ని బస్తాలు కిందపడ్డాయి. దీంతో బియ్యం రోడ్డుపై పడ్డాయి. లారీడ్రైవర్ కొద్దిదూరం వరకు గమనించలేదు. వెనుక వస్తున్న ప్రయాణికులు లారీడ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తిరిగి వచ్చి బస్తాలను తిరిగి లారీలో లోడ్ చేసుకున్నాడు.



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



రాజన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. అభిషేకాది పూజలు, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో..

వేములవాడ టౌన్: వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏఈవో శ్రవణ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సుహాసినీల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించగా, ఆలయ అర్చకుల చేతుల మీదుగా వారికి వాయనం పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అశోక్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, సింహచారి, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం వేలాదిగాభక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందుగల రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. రాత్రివేళల్లో దేవస్థానం తరుపున దీపోత్సవం నిర్వహించారు. కాగా శనివారం జగిత్యాల మొదటి అదనపు సెషన్స్ న్యాయమూర్తి నారాయణ అంజన్నను దర్శించుకున్నారు.

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి

పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు పతకాలను గెల్చుకున్నారు. 400మీటర్ల రన్నింగ్‌లో హోమ్‌రాజు గోల్డ్ మెడల్, అచల్ సిల్వర్‌మెడల్, లాంగ్‌జంప్‌లో గణేష్ గోల్డ్‌మెడల్, రన్నింగ్‌లో జె రోషన్ సిల్వర్‌మెడల్ గెల్చుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ సుమన్‌ను డైరెక్టర్ కల్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ వి లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు అభినందించారు.

కడెం ప్రాజెక్టులో దూకి ఉపాధ్యాయుడి బలవన్మరణం



రాజశేఖర్(ఫైల్)

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులో దూకి ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లిజిల్లా జూలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుంట్ల రాజశేఖర్ రెడ్డి శనివారం వివాహ విందుకు వచ్చి ప్రాజెక్టులో దూకాడు. గమనించిన ఇరిగేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్ నగర్‌లో నివాసముండే ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు దాసరి రాజ్‌కుమార్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ భార్య స్రవంతి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చేసరికి రాజ్‌కుమార్ అపస్మారక స్థితిలో ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆమె రాజ్‌కుమార్ తండ్రి చంద్రయ్యకు ఫోన్‌చేసి తెలిపింది. రాజ్‌కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని చంద్రయ్య శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర సదస్సును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మెన్ డాక్టర్ పి కిషన్ తెలిపారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని వీ కన్వెన్షన్‌లో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పేషంట్లకు అందించే అధునాతన వైద్యంపై సీనియర్ వైద్యులు మాట్లాడుతారని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో పేషంట్లకు ఎలాంటి వైద్యం అందించాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి సదస్సులు నేటితరం వైద్యులతో పాటు, ఇతర సీనియర్‌వైద్యులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ విజేందర్‌రెడ్డి, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేశ్‌బాబు, కోశాధికారి డాక్టర్ నీలిమ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్ వసంత్‌రావు, మాజీ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

● రచ్చపల్లి పాఠశాలలో కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు
● జంక్ ఫుడ్ నిషేధంతో పొదుపు చేస్తున్న విద్యార్థులు
● లంచ్ టైంలో బ్యాంక్ నిర్వహణ



విద్యార్థులకు పొదుపు పాఠాలు

ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో విద్యార్థులు పొదుపు పాఠాలు నేర్చుకుంటున్నారు. చిరుతిండి కోసం తెచ్చుకున్న నగదును కిడ్డీ బ్యాంక్ పేరుతో జమ చేసుకుంటూ.... లెక్కాపత్రాలు చూసుకుంటూ... ఆర్థిక పాఠాల వైపు అడుగులు వేస్తున్నారు.

ఆటాపాటలతో విద్యనందిస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల గుర్తింపు తెచ్చుకొంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోజూ లంచ్ టైంలో బయట ఏదో ఒక చిరుతిండి కొనుగోలు చేస్తారు. అందుకు ఐదు నుంచి పది రూపాయలు ఖర్చు చేస్తారు. పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధంతో రోజు తెచ్చుకునే చిల్లర డబ్బులు ఖర్చు కాకుండా విద్యార్థులు కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసి అందులో జమ చేసుకుంటున్నారు. ఇందుకోసం కిడ్డీ బ్యాంక్ పేరిట విద్యార్థులు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఒకరు మేనేజర్ గా వ్యవహరిస్తూ ఉండగా మరొకరు క్లర్క్‌గా ఉన్నారు. ఈ కిడ్డీ బ్యాంక్ కేవలం లంచ్ అవర్లో మాత్రమే నిర్వహిస్తారు. విద్యార్థులు తెచ్చుకున్న డబ్బులను మేనేజర్, క్లర్క్ పర్యవేక్షణలో కిడ్డీ బ్యాంక్‌లో వేసి లెడ్జర్ బుక్‌లో నమోదు చేస్తారు. జమ అయిన మొత్తం రూపాయల నుంచి వారికి అవసరం ఉన్నంతా విత్ డ్రా చేసి చదువుకు అవసరమైన పెన్, పెన్సిల్, నోట్ బుక్స్ కొనుగోలు చేసుకుంటారు. దీంతో విద్యార్థులు చిన్న నాటి నుంచే బ్యాంక్ పని తీరు ఎలా ఉంటుందో నేర్చుకోవడమే కాకుండా, ప్రతీ రూపాయి విలువ తెలుసుకుని విద్యార్థులు భవిష్యత్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగ పడుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కిడ్డీ బ్యాంక్‌లో డబ్బులు జమ చేసుకుంటున్న విద్యార్థులు

ఆర్థిక క్రమశిక్షణ నేర్పేందుకే కిడ్డీ బ్యాంక్

- సముద్రాల వంశీ మోహనాచార్యులు (పాఠశాల ప్రధానోపాధ్యాయులు)



చాలా మంది విద్యార్థులు చిన్న నాటి నుంచే జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. అందుకే పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధం పెట్టాం. దీంతో చిరు తిండ్లు తినకుండా ఆరోగ్యం కాపాడుకుంటారు. దాంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకుంటారు.

పొదుపు ఎలా చేయాలో నేర్చుకున్న

- అర్జున్ తిలక్ (5వ, తరగతి విద్యార్థి)



రోజు ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులతో ఏదో ఒకటి కొనుక్కొని తినేవాన్ని. పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్ ఫుడ్‌ను నిషేధించారు. దీంతో మేమే కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసుకొని రోజు 5, 10 రూపాయలు అందులో జమ చేసుకుంటున్నాం. ఇప్పుడు నా ఖాతాలో 150 రూపాయలు ఉన్నాయి.

విద్యార్థుల ఆర్థిక భవిష్యత్‌కు పునాది

- హరిణి (పేరెంట్)



డబ్బుల విలువ తెలిసేలా కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పిల్లలకు ఇది ఒక మంచి అలవాటుగా మారడమే కాకుండా వారి ఆర్థిక భవిష్యత్‌కు పునాది వేస్తుంది. కిడ్డీ బ్యాంక్ ఆలోచన చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదా వరిలోకి 47,059క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీకి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా ప్రస్తుతం 4 గేట్ల నుంచి దిగువకు 8వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 7934క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 320క్యూసెక్కుల నీరు మొత్తం 8254 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ 4గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 254క్యూసెక్కులు మొత్తం 8254క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెలుతోందని అధికారులు తెలిపారు.

రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేకొండ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, బ్రిడ్జిలను, రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 10వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలన్నారు. మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేలు చేయాలన్నారు. అనేక గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, వ్యవసాయ బావులు దెబ్బతిన్నాయన్నారు. పశువులు మృతచెందిన సంఘటన కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, సీపీఐ జిల్లాకౌన్సిల్ సభ్యుడు బోయినిపటేల్, ముద్రకోల రాజయ్య, పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచాల రవి, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

కాశీలో వేములవాడ రాజన్న కల్యాణం

వేములవాడటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం కాశీ పుణ్యక్షేత్రంలోని విశ్వనాథ ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీపరాశర వైదిక ఆగమ వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్‌శర్మ, నెమలికొండ రాజేశ్వరశర్మ, మామిడిపల్లి శరత్, వెంకటయ్య ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓబి శ్రీనివాస్, సూపర్డెంట్ శ్రీనివాస శర్మ, వి.భాస్కర్ పాల్గొన్నారు.


రాజన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొనుగోలు కేంద్రాలకు దొంగల బెడద

● రాత్రివేళలో చోరీకి గురవుతున్న ధాన్యం
● చోద్యం చూస్తున్న నిర్వాహకులు

మానకొండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యాన్ని తరలిస్తే కాపలాదారులు లేకపోవడంతో రాత్రి వేళలో ధాన్యం చోరీకి గురవుతోంది. దీంతో రైతులు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో లింగాపూర్, రంగపేట, పచ్చునూర్, వెల్ది, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడేందుకు రాత్రివేళలో నిర్వాహకులు కాపలాదారులను నియమించాల్సి ఉంటుంది. అవేమీ పట్టించుకోకుండా నిర్వాహకులు వదిలి వెళ్లిపోతున్నారు. ఇదే అదనుగా భావించి రోడ్డుకు దగ్గరగా ఉండే కొనుగోలు కేంద్రాలను టార్గెట్ చేసిన దొంగలు రాత్రివేళలలో వాహనాల్లో ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రంగపేట కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ వాహనంలో 20సంచుల్లో ధాన్యం నింపుతుండగా దారివెంబడి వెళ్లే వారు గమనించి రైతులకు సమాచారం అందించారు. రైతులు సంఘటనా స్థలానికి చేరుకొని పట్టుకునే క్రమంలో ఒకరు పారిపోగా మరొకరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మేల్కొని కాపలాదారులను ఏర్పాటు చేసిధాన్యాన్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు.


రంగపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలవాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కరీంనగర్ ఉమ్మడిజిల్లా జట్లు విశేష ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల శిక్షణశిబిరాన్ని సుడాచైర్మన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కోచ్‌ల శిక్షణలో క్రీడాకారులు ఖో-ఖోలోని నైపుణ్యాలలో ప్రతిరోజు సాధన చేస్తున్నారన్నారు. ఈనెల7,8,9తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడిజిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు, ట్రాఫిక్ ఆర్ఐ కుమారస్వామి, రాష్ట్ర డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సురేందర్ రెడ్డి, ఎస్సారార్ కళాశాల ఉపన్యాసకులు, జిల్లా సంఘ ప్రతినిధులు సూర్య ప్రకాశ్, డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, కరుణాకర్, అశోక్, రాములు, ఖో-ఖో కోచ్‌లు వెంకటేశ్, ఆనంద్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

ఓదెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కనగర్తి విద్యార్థి వేల్పుల అక్షయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా స్థాయిలో బంగారుపతకం సాధించింది. మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షయ ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ కుమారస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు. వరంగల్ జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి.


అక్షయకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

● 44.23 శాతం పోలింగ్
● పోలైన ఓట్లు కరీంనగర్‌లో 3,342 ఓట్లు... జగిత్యాలలో 772


పోలింగ్ కేంద్రం లోపల హెల్ప్ డెస్క్ వద్ద ఓటర్ల సందడి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్‌బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సాధారణ ఎన్నికల తరహాలో ఉదయం 7గంటల నుండే బ్యాంకుసభ్యులు (ఓటర్లు) తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 44.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,287 మంది ఓటర్లు ఉండగా కరీంనగర్‌లో 7,272 మంది ఓటర్లకు 3,342 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,025మంది ఓటర్లు ఉండగా 772 మంది ఓట్లు వేశారు. కరీంనగర్ ఓటర్ల కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో 24పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో స్టేషన్‌లో 300మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జగిత్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 7 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఒక్కోస్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీవో, ముగ్గురు సిబ్బందితోపాటు మొత్తం 150 మందిని ఎన్నికల కోసం డ్యూటీలు వేశారు. 12 డైరెక్టర్లలో ఎస్సీ, ఎస్టీకి ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌కు తొమ్మిది స్థానాలను రిజర్వు చేయడంతో ఎస్సీఎస్టీల కోసం బ్ల్యూ, మహిళలకు పింక్, జనరల్‌కు వైట్ కలర్ మూడు రంగుల్లో ఉన్న బ్యాలెట్‌లో ఒక్కో ఓటరు 12ఓట్లను వినియోగించుకోవాలని, అంతకంటే ఎక్కువ ఓట్లు వేస్తే చెల్లుబాటు కావని, తక్కువ ఓట్లు వేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు కరీంనగర్, జగిత్యాలలో ప్రశాంతంగా ముగిసింది. ఆ తర్వాత జగిత్యాల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందితో తరలించారు.

● నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు..

5 గంటల వరకు జగిత్యాల పోలింగ్ బాక్సులు కరీంనగర్‌కు చేరుకోగానే నాలుగు టేబుళ్లపై ఒక్కో బాక్సును ఓపెన్‌చేసి మూడు రంగుల్లోని బ్యాలెట్లను వేరు చేసి 50 చొప్పున బెండళ్లు కట్టి లెక్కింపు ప్రారంభించారు. సాయంత్రం 7.30గంటలకు మహిళాడైరెక్టర్ పోస్టులకు సంబంధించిన ఓట్లను, ఎస్సీ, ఎస్టీ రిజ ర్వుడ్ ఓట్లను ఒక్కో టేబుల్ వేసి వేర్వేరుగా లెక్కింపు ప్రారం భించగా, జనరల్ ఓట్ల కోసం రెండు టేబు ళ్లను వేసి లెక్కించారు.

● నేడో, రేపో చైర్మన్ ఎన్నిక

నాలుగు రౌండ్లలో లెక్కింపు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితం తేలనున్నది. గెలుపొందిన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆదివారం లేదా సోమవారం ఎన్నికైన డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

● జగిత్యాలలో 36 శాతం పోలింగ్..

జగిత్యాల అర్బన్: కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఎన్నికలు జగిత్యాలలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాలలో 36శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం పోలింగ్ మందకొడిగాసాగింది. మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరగగా రెండు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం గేట్‌వేశారు. ఈ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాలు గ్రామాలకు చెందిన పలువురు తమ ఓటుహక్కు వినియో గించుకున్నారు. జగిత్యాల అర్బన్‌బ్యాంక్ ఎన్నికల్లో అనేకమంది ఓట్లు గల్లంతు అయ్యాయని బీజేపీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. బ్యాంక్‌లోని వాటాదారులు మరణిస్తేతప్ప వారిఓట్లు తొలగించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు బతికిఉన్న వారి ఓట్లు ఎందుకు తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలించి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.


జగిత్యాలలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

రాజకీయ లబ్ధి కోసమే కవిత ఆరాటం

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మైనార్టీల సహకారం కోరుతున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి మొహమ్మద్ అజీం విమర్శించారు. శనివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. గతంలో నిజామాబాద్ సభలో ముస్లింలను పక్షులతో పోల్చడం, ముస్లింలను అవమానపరిచే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోలేదన్నారు. ఇప్పుడు హఠాత్తుగా మైనారిటీల సహకారం కోరడం ఎంతవరకు సబబు అని అజీం ప్రశ్నించారు. రాజకీయాల కోసమే కవితకు మైనార్టీలు, ప్రజలు గుర్తుకువస్తారని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యల పేరిట రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాల్లో బంగారు తెలంగాణ నినాదంతో ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. అధికారం కోల్పోయిన తర్వాతనే ప్రజలు, ప్రజల సమస్యలు గుర్తుకు వస్తున్నారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమిపై కవిత మాట్లాడకపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే అన్నారు.

రైతుల గోడును పట్టించుకోండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ధర్నా

చొప్పదండి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతుల గోడును పట్టించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం చొప్పదండి తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటనష్టపోయిన రైతుల బాధ వర్ణనాతీతమని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని అన్నారు. ఎకరానికి 40వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లాకార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రవణ్‌కుమార్, మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ పాల్గొన్నారు.




చొప్పదండిలో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, హుజూరాబాద్‌లో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

● రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్/ఇల్లందకుంట/చిగురుమామిడి/గన్నేరువరం/వీణవంక/శంకరపట్నం/గంగాధర/కరీంనగర్ రూరల్: తుఫానుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని శనివారం బీజేపీ నాయకులు ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులకు ఒకొక్కరికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లందకుంటలో బీజేపీ మండలాధ్యక్షుడు భైరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో వేలఎకరాల్లో వరిపంట నీట మునిగిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.50వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చిగురుమామిడిలో బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజ్ సంతోష్ మాట్లాడుతూ తుఫానుకు రైతులు తీవ్రంగా నష్టపోయారని వెంటనే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెగిపోయిన రోడ్లను మరమ్మతు చేయాలని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గన్నేరువరంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వీణవంక, శంకరపట్నంలలో బీజేపీ మండలాల అధ్యక్షులు బత్తిని నరేష్‌గౌడ్, ఏనుగుల అనిల్ రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు. గంగాధర మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కరీంనగర్ రూరల్ మండలంలో తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ రూరల్ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాడి శెట్టి సంతోష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే సంగతులు

● కోతకు గురై ప్రమాదకరంగా మారిన రహదారి



హుజూరాబాద్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో మండలంలోని జూపాక గ్రామంలోని ప్రధానరహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వరద ముప్పు తొలగి రెండు రోజులు గడుస్తున్నా కోతకు గురైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా అధికార యంత్రాంగం చేపట్టలేదు. దీంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. దారి గుండా వెళ్తున్నవారు ఆందోళనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాదారులైతే మరింత వణుకుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి మరమ్మతు పనులు చేయాలని ఈ ప్రాంత ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



హుజూరాబాద్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద వారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 135మంది లబ్ధిదారులకు రూ.47.62లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు వెంటనే బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేవి దిగజారుడు రాజకీయాలు..

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ సంబంధించిన వ్యక్తులతో చిట్‌చాట్ కార్యక్రమం పెట్టి, లేనివ్యక్తులను జూబ్లీహిల్స్‌లో ఉన్నట్టుగా బోగస్ ప్రచారాలు చేస్తున్నాడన్నారు. ప్రచారం చేయాలి కానీ, రాజకీయాల్లో ఇంత దిగజారుడు రాజకీయం పనికిరాదన్నారు. జూబ్లీహిల్స్‌లో యువత నవీన్‌యాదవ్‌కు మద్దతు ప్రకటిస్తూ ఆయన సోషల్ మీడియానే చెప్తుందని, ఇది చూసైన కౌశిక్‌రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు జూబ్లీహిల్స్‌లో నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

వీణవంక: మండలంలోని 17గ్రామాలకు చెందిన 30మంది లబ్ధిదారులకు 9లక్షల 35వేల 500రుపాయల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శనివారం పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, తిరుపతి, మార్కెట్ డైరెక్టర్ రషీద్ పాషా పాల్గొన్నారు.

మాటలతో రైతులను మభ్య పెట్టొద్దు

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

● రైతులకు పరిహారం అందించాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో రైతులను మభ్యపెట్టకుండా వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూపాక, రాంపూర్ గ్రామాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 30వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా తెలుపుతుంటే.. కేవలం 825 ఎకరాల్లో పంట నష్టం జరిగిదంటూ ప్రభుత్వానికి నివేదికలు అందటం దారుణమన్నారు. వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సర్వే నివేదికలను తయారు చేయాలన్నారు. ప్రతి రైతు కూలీకి సంవత్సరానికి రూ. 12వేలు అందించాలన్నారు.



జూపాకలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, సుందరగిరి, రేకొండ గ్రామాల్లో ఆపార్టీ నాయకులతో కలిసి దెబ్బతిన్న పంటలను, రోడ్లను, బ్రిడ్జిలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తి న్యాయం జరిగేంత వరక తమ పార్టీ రైతులకు అండగా ఉంటుం దన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీల ఫోరమ్ మండల కన్వీనర్ మిట్టపల్లి మల్లేశం, రైతుసమితి మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేష్ యాదవ్, తోట శ్రీనివాస్, గంప నాగరాజు, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా నగరంలోని గోదాం గడ్డ 11కేవీ పరిధిలో ఆదివారం ఉదయం10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏడీఈ-2 ఎం లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. గోదాంగడ్డ 11 కేవీ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, అంజనాద్రి దేవాలయం, దోబీఘాట్, గోదాం గడ్డ, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, జడ్పీ క్వార్టర్స్, భగత్‌నగర్‌లో కొంత భాగం, మల్లమ్మ మార్కెట్, బీఎస్ఎఫ్ క్వార్టర్ల వెనుకభాగం, గోదాం గడ్డ వెనుక వైపు, రఘుపతిరెడ్డి ఆసుపత్రి ప్రాంతంలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మా నగర్, తిమ్మాపూర్ చైతన్యకళాశాల, సెయింట్ ఆంథోనిస్కూల్, ఎల్ఎండీ పోలీస్ స్టేషన్, వెంకటేశ్వర రైస్‌మిల్, శ్రీహోమ్స్, శంకర్‌హోమ్స్ ఏరియాల్లో ఆదివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతాలకు సంబంధించిన 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు కొట్టి కార్యక్రమం ఉన్నందున విద్యుత్ అంత రాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'



తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో మనకొండూర్ నియోజకవర్గ ప్రజలు, జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతన్నలు సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని స్వామివారిని వేడుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు మెచ్చిన సుపరిపాలన జరిగే విధంగా ప్రభుత్వానికి ఆ స్వామివారి అనుగ్రహం ఉండాలని, పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడ్డ కార్యకర్తలకు మంచి రోజులు రావాలని స్వామివారిని వేడుకున్నామని అన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును హైదరాబాద్‌లో ఆయన గృహంలో మనకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ అధికారప్రతినిధి మేన్నేని రోహిత్‌రావులు పరామర్శించారు. ఇటీవల హరీష్‌రావు తండ్రి మరణించగా ఎమ్మెల్యే శనివారం హరీష్‌రావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట రోహిత్‌రావు కూడా ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వీణవంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ మహమ్మరిని తరిమివేయాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమపథకాల అమలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వడ్లకొండ అనిల్,ఆవునూరి కోమాల, శ్రీధర్, సురేష్, రాజు, తిరుపతి, శ్రావణ్, అసియా, శోభ తదితరులున్నారు.

వృత్తివిద్యతో ఉపాధి అవకాశాలు

గంగాధర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యతో నైపుణ్యంగల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని బీఎస్ రావు ఫౌండేషన్ చైర్మన్ బీఎస్‌రావు అన్నారు. శనివారం గంగాధర ఎంపీడీవో సమావేశం మందిరంలో న్యాక్ సెంటర్‌లో వివిధ వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 20మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్‌సంస్థ సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఆర్‌పీఎల్ స్కిల్ శిక్షణ కార్యక్రమాలు ప్రతినెల కరీంనగర్ జిల్లాలోని అన్నిమండలాల్లో నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. న్యాక్ అసిస్టెంటు డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ శిక్షణలో పురుషులు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ఒకగొప్ప ముందడుగని తెలిపారు. బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం ప్రశంసనీయమని ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయన్నారు.

అనధికార నాలుగో అంతస్తు సీజ్

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముకరంపురలో అనధికారికంగా నిర్మించిన భవనంలోని నాలుగో అంతస్తును మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం ముకరంపురాలోని టి శంకర్‌కు చెందిన భవనంలోని అనధికార నాలుగో అంతస్తును సీజ్ చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్రీధర్‌ప్రసాద్, వేణు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు రాజ్‌కుమార్, సంధ్య, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు నదియా ఇష్రత్, సయ్యద్ ఖాదర్ అహ్మద్ పర్యవేక్షణలో హైకోర్టు ఆదేశాల మేరకు భవనాన్ని పరిశీలించి, సీజ్ చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లాడ్జ్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. మరో ఎనిమిది మంది పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల వద్ద నుంచి 3,200 రూపాయల నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నా మని సీఐ తెలిపారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

ఏఏ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా 'తమ్మనవేని'

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన తమ్మనవేని అంజి యాదవ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు స్టేట్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా అంజియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



అల్లు అర్జున్‌తో అంజి

చినుకుపడితే రోడ్లన్నీ చెరువులే..



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఇల్లందకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ చెరువుల్లాగా మారుతున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు భైరెడ్డి రమణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిరిసేడు రోడ్డుపై గుంతలమయంగా మారి చెరువును తలపిస్తున్న రోడ్డు వద్ద బీజేపీ నాయకులు ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించి రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్త శ్రీనివాస్, తడిగొప్పుల రమేష్, ఎండీ షఫీ, అంతం ఎల్లారెడ్డి, దుర్గయ్య, సంపత్, సాయిరెడ్డి, మల్లేష్, శ్రీధర్, కుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ వైభోగం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారామ కల్యాణాన్ని కన్నులపండువలా నిర్వహించారు. మండల శ్రీదేవి-విక్రమ్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శిరీష హోత్రి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సా యంత్రం రథంపై శ్రీవారు సీతాసమేతుడై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ మేచినేని వనజ-అశోక్‌రావు, బీవీ రావు, వెంకటేశం, పవన్‌రావు, అశోక్‌రావు, రవీందర్ రావు, వేంకట్‌రావు, ప్రవీణ్, రమ్యకృష్ణ భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు



ఆకాశదీప ప్రారంభ పూజల్లో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి, శనివారం సందర్భంగా నగరంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం, రాత్రి ఆలయాల్లో, ఇళ్లలో, ఉసిరి, తులసి చెట్ల వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. కార్తీక దీపదానాలు, పుణ్య నదీస్నానాలు, ప్రత్యేక పూజలతో పులకరించిపోయారు. ఆకాశదీపాలు ఏర్పాటు చేశారు. శ్రీపురంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు, రాధాకృష్ణుల కల్యాణం జరిపి భోజనాలు చేశారు. మహాశక్తి ఆలయంలో శివవైభవంపై జి మహేశ్వరశర్మ ప్రవచనం కొనసాగింది.

నషా ముక్తి భారత్ అభియాన్ రంగోలి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివా రం రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన, వ్యసన రహిత జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సమాజంలో మత్తు పదార్థాల ప్రమాదాలను ప్రతిబింబించే అందమైన, సందేశాత్మక రంగోలీలు రూపొందించారని అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి సామాజిక అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీవో బి సంపత్ కుమార్, ఏవో బండి శ్రవణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్, బి మహేష్, ఎన్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, ఏవో

ప్రైవేట్ పాఠశాలల కృషి అభినందనీయం

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో విద్యారంగ సేవే లక్ష్యంగా అనేక వ్యయప్రయాసలకు ఓర్చి రాష్ట్రంలో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల కృషి అభినందనీయమని ట్రస్మా రాష్ట్ర కన్వీనర్, వివేకానంద విద్యానికేతన్ చైర్మన్ కొమురయ్య సొగాని అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ట్రస్మా ఆధ్వర్యంలో ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ వ్యయాలు, ఆర్థిక ప్రణాళికలు, పాఠశాలల నిర్వహణ సౌలభ్యత తదితర అంశాలపై వర్తన, ఎడ్యు ఫైనాన్స్ సంస్థ వారు పాఠశాలల కరస్పాండెంట్లకు సంపూర్ణ అవగాహన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ సాధుల మధుసూదన్, డైరెక్టర్ సొగాని అనుదీప్, వి నరేందర్‌రెడ్డి, కె అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వి లింగయ్య, కె చెన్నప్ప, పి పాతిమారెడ్డి, ఎం నగేశ్ రెడ్డి, ఎస్ ముత్తయ్య, మాజీద్, లియాఖత్ అలీ, సీహెచ్ వెంకటేశ్వర్లు, రామారావు, ఉపేందర్, రాజు, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎంఎం శశి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్మ రాష్ట్ర కన్వీనర్ సొగాని కొమురయ్య

నేడు అంజనాద్రిపై వ్రతాలు.. రుద్రాభిషేకాలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రుద్రాభిషేకాలు జరుగనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య సంకీర్తనల ఆలాపనలు, వ్రతాల అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. అభిషేకం చేయించుకునే భక్తులకు తిరుపతి శ్రీవారి ప్రసాదం, కంకణాలు, అక్షతలు, పార్థివ శివలింగం ఇస్తామని తెలిపారు. వేదం, నాదం, గానం, ప్రవచనం ఏకకాలంలో జరిగే ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక చేయూత

● ఉపాధిహామీలో అనుసంధానం ● మండలంలో 36 మంజూరు

కరీంనగర్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఓ వైపు రెండతస్తుల వరకు నిర్మించుకోవచ్చని తెలుపగా మరో వైపు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించనుంది. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో ఇందిరమ్మ పథకాన్ని అనుసంధానం చేయగా ..జాబ్ కార్డు ఉన్న లబ్ధిదారులకు 90 రోజుల పని కల్పించి వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. తన సొంతింటికి కూలీ పనులు చేసుకున్నట్లయితే రోజువారి వేతనం 307 రూపాయలు ఉండగా గరిష్ఠంగా 90 రోజులకు 27,630 రూపాయలను చెల్లిస్తుంది. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసింది. ఒక్కో మరుగు దొడ్డి నిర్మాణానికి 12వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తుంది. లబ్ధిదారుల గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఐదు లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు మరుగుదొడ్డి నిధులతో అదనపు ప్రయోజనం చేకూరనుంది. కరీంనగర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా కరీంనగర్ రూరల్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకోసం మొత్తం 3,411 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే అన్ని గ్రామాల్లో 1081 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి 988 మందికి ప్రొసిడింగ్‌లను ఇటీవలే అందజేశారు.



బహదూర్‌ఖాన్ పేటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

● జిల్లాలో 1,402 మరుగుదొడ్లు మంజూరు

కాగా జిల్లాలో మొదటి విడతలో 407, రెండో విడతలో 995 చొప్పున మొత్తం 1,402 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. ఇందులో అత్యధికంగా హుజురాబాద్ మండలానికి 151 మంజూరు కాగా అత్యల్పంగా కరీంనగర్ రూరల్ మండలానికి 36 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. మండలాల వారీగా లబ్ధిదారుల జాబితాను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామి ఏపీవోలకు పంపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మరుగుదొడ్డి నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి ఆధారంగా మిగతా లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరవుతాయని అధికారులు తెలిపారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.